వైఎస్ఆర్ వాహనమిత్ర మెగా చెక్కు విడుదల చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, కలెక్టర్, తదితరులు

'అనంత' కరువుపైనా స్వామినాథన్ అధ్యయనం

సమస్యల అధ్యయనమే కాదు.. పరిష్కార మార్గాలూ సూచన పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హరిత విప్లవ పితామహుడుగా పిలువబడే వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్‌కు అనంతపురం జిల్లాతోనూ అనుబంధం ఉంది. రైతు ఆత్మహత్యలపై అధ్యయనం చేసే సమయంలోనే కాకుండా జిల్లాలో నెలకొన్న కరువు, ప్రత్యేక పరిస్థితులను అధ్యయనం చేసే విషయంలోనూ ఆయన పాత్ర ఉండటం గమనార్హం. డాక్టర్ స్వామినాథన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని వ్యవసాయ పరిస్థితులపై అధ్యయనం చేసి నివేదికను రూపొందించారు. ఆయన అధ్యక్షతన రుక్మణి, మంజుల 2009లో ఈ అధ్యయన నివేదికన రూపొందించారు. ఇందులో జిల్లాలోని భౌగోళిక పరిస్థితులు మొదలుకుని, వాతావరణం, నేల స్వభావం, సాగునీటి వనరులు ఇలా అన్నింటినీ అధ్యయనం చేశారు. దీంతోపాటు పూర్వం నుంచి జిల్లాలోని వ్యవసాయంతోపాటు, సాగు పద్ధతుల్లో వచ్చిన మార్పులను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు.

సమగ్రమైన అధ్యయనం

1961 నుంచి 2009 వరకు జిల్లాలో వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులన్నింటినీ ఆ నివేదికలో పొందిపరిచారు. 1961లో అత్యధికం ఆహార ధాన్యపు పంటలు సాగవుతుండేవని పేర్కొన్నారు. అప్పట్లో సుమారు చిరు, ఆహార ధాన్యాలన్ని కలిపి ఐదు లక్షల హెక్టార్ల వరకు పంటలు సాగవుతే ఉండేవి. ఆ సమయంలో వేరుశనగ కేవలం రెండు లక్షల హెక్టార్లలోపే ఉండేది. అయితే దేశంలో వచ్చిన మార్పులు, వాణిజ్య అవసరాల నేపథ్యంలో జిల్లాలోనూ వ్యవసాయ సాగులో నూనె గింజల సాగుపై రైతులు అత్యధికంగా మొగ్గు చూపడం కనిపించిందని ఆ నివేదికలో పేర్కొన్నారు. రెండు లక్షల హెక్టార్ల లోపు ఉన్న వేరుశనగ సాగు 2006 సమయానికి ఎనిమిది లక్షల హెక్టార్లకు చేరిందని పేర్కొన్నారు. అయితే మారిన పంటల సాగుకు అనుగుణంగా విత్తనాల్లో మార్పులు రాలేదు. ఎప్పుడో 1941 నాటి టిఎంవి-2 రకమే దశాబ్దాల పాటు సాగవుతూ వచ్చింది. కొత్త రకాలైన వంగడలు పెద్దగా రాలేదు. ఆ తరువాత జెఎల్ 24, కె-6లు వచ్చినట్టు తెలిపారు. ఈ విత్తనం కూడా ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చినప్పటికీ సరైన నాణ్యత లేక రైతులకు ఆశించిన దిగబడులు కూడా రాని పరిస్థితులు నెలకొన్నట్టు వివరించారు. వ్యవసాయ పద్ధతులను ఇబ్బందులను అధ్యయనం చేస్తూనే కొన్ని సూచనలు సైతం చేశారు.

వారు చేసిన సూచనలు

నాణ్యతమైన విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలి. గ్రామ స్థాయిలోనే విత్తనోత్పత్తి జరగాలి. కొత్త వంగడాలను ఎప్పటికప్పుడు తీసుకొచ్చి దిగుబడులు పెరిగే విధంగా చూడాలి. సేంద్రీయ ఎరువుల వాడకం పెంచేందుకు పశుపోషణ అవసరమవుతుందని సూచించారు. జిల్లాలో పశు సంపద అందుకు అనుగుణంగానే ఉన్నట్టు పేర్కొన్నారు. అదే విధంగా గిడ్డంగులను స్థానికంగా పెంచాల్సిన అవసరముంది. మార్కెటింగు సౌకర్యం కల్పించడం, సాగునీటి వసతి పెంపొందించడం వంటి చర్యలు తీసుకోవాలని ఈ నివేదికలో సిఫారసులు చేశారు. ఇలా జిల్లాలోని కరువు పరిస్థితులు, వాటి పరిష్కారాలను స్వామినాథన్ ఫౌండేషన్ ద్వారా 2009లోనే చేశారు. అయితే పాలకులు వీటి అమలుపై దృష్టి సారించిన దాఖలాలు కనిపించడం లేదు. ఇప్పటికీ రైతులకు నాణ్యమైన విత్తనం అందుబాటులో లేదన్న విమర్శలున్నాయి. అదే విధంగా తక్కిన సిఫారసుల విషయంలోనూ వెనుకబాటు ఉన్నట్టు రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి ఉషశ్రీచరణ్

వాహనమిత్ర మెగా చెక్ విడుదల

జిల్లాలో 8,806 మందికి రూ. 8.80 కోట్లు లబ్ధి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వైసిపి ఎన్నికల మ్యానిఫెస్టోలోని ప్రతి అంశాన్ని తూచ తప్పకుండా అమలు చేస్తూ ప్రజలు, కార్మికులు, రైతులు, విద్యార్థుల సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కెవి.ఉషాశ్రీచరణ్ పేర్కొన్నారు. విజయవాడలోని బహిరంగ సభ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రెడ్డి వైఎస్ఆర్ వాహనమిత్ర పథకం కింద బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. అనంతపురం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కెవి.ఉషాశ్రీచరణ్, జిల్లా కలెక్టర్ యం.గౌతమి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర పాలక సంస్థ మేయర్ వసీం, ఆర్టీసీ రీజనల్ డైరెక్టర్ మంజుల, డిసిసిబి బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, సిడబ్ల్యూసీ చైర్ పర్సన్ మేడా రామలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ రిజ్వాన్, ఉప రవాణా కమిషనర్ వీర్రాజు, ఆర్టీవో సురేష్ నాయుడు తదితరులు వీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వరుసగా ఐదవ ఏడాది వైఎస్ఆర్ వాహనమిత్ర పథకాన్ని అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలుపుకున్నారన్నారు. జిల్లాలో ఐదవ ఏడాది వైఎస్సార్ వాహనమిత్ర కింద 8,806 మంది లబ్ధిదారులకు రూ.8.80 కోట్ల లబ్ధి చేకూర్చామన్నారు. ఆటో, మోటార్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లని ఆదుకుంటూ సకాలంలో ఇన్సూరెన్స్, అవసరమైన రిపేర్లు చేయించుకునేందుకు, వారి వాహనాలను మంచి కండిషన్‌లో ఉంచుకునేందుకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. కలెక్టర్ యం.గౌతమి మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆటో, మోటార్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు రూ. 8.80 కోట్ల మెగా చెక్‌ను మంత్రి, జిల్లా కలెక్టర్ అందజేశారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరారెడ్డి

బిజెపి అండతోనే చంద్రబాబు అరెస్టు

సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరా రెడ్డి

ప్రజాశక్తి మడకశిర

భారతీయ జనతా పార్టీ అండతోనే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును వైసిపి ప్రభుత్వం అరెస్టు చేసిందని సిడబ్ల్యూసి మెంబర్, మాజీ మంత్రి రఘువీరా రెడ్డి ఆరోపించారు. శుక్రవారం సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం నీలకంఠాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు అరెస్టుకు బీజేపీనే కారణమన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి బలపడటానికి ఇలాంటి చర్యలకు పాల్పడుతోందన్నారు. అందులో భాగంగా వైసిపి ప్రభుత్వ భుజంపై తుపాకీ పెట్టి టిడిపికి గురిపెట్టిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బిజెపి బలోపేతం చేయడానికి పురంధరేశ్వరిని బిజెపి అధ్యక్షురాలిగా నియమించారని అన్నారు. . భారతీయ జనతా పార్టీ అనే అనకొండ కోరల్లో చంద్రబాబు బలంగా ఇరుక్కొన్నారన్నారు. ప్రధానమంత్రికి, హోంమంత్రికి తెలియకుండా చంద్రబాబు అరెస్టు జరగలేదని అన్నారు. చంద్రబాబు అరెస్టు తరువాత టిడిపి అన్ని పార్టీలను కలిసిందని కాంగ్రెస్ పార్టీని మాత్రం కలవలేదని అన్నారు. భవిష్యత్తులో టిడిపి, వైసిపికి కూడా రాష్ట్రంలో మనుగడ లేకుండా చేయడానికి కుట్ర పన్నిందని ఆరోపించారుఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, మందలపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'అనంత'లో డాబా(ర్లు)

యథేచ్ఛగా మద్యపానం

కన్నెత్తి చూడని పోలీసులు, ఎక్సైజ్ అధికారులు

నిబంధనలు పాటించని నగరంలోని ఓ డాబా

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

చూసేందుకు బయట డాబా లేదా ఫ్యామిలీ రెస్టారెంట్ అనే బోర్డు ఉంటుంది. కానీ లోపల ఒకదానికొకటి దూరంగా ఉన్న గుడిసెల్లాంటి వాటిలో యథేచ్ఛగా మద్యం తాగుతూ ఎంజాయ్ చేస్తుంటారు. ఇది అనంతపురం నగరంలోని పలు డాబాలు, ఫ్యామిలీ రెస్టారెంట్ల పరిస్థితి.

యథేచ్ఛగా మద్యపానం : నగరంలోని పలు ప్రాంతాల్లో డాబాలు, ఫ్యామిలీ రెస్టారెంట్లు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా బళ్లారి బైపాస్ నుంచి రుద్రంపేట బైపాస్ మీదుగా హైవేపై రాప్తాడు వరకు ఉన్నాయి. అదేవిధంగా ఆర్టీసీ బస్టాండ్ నుంచి గుత్తి రోడ్డులో మార్కెట్ యార్డు వరకు పలు డాబాలు ఉన్నాయి. వీటిలో ఉదయం 12 గంటల నుంచి రాత్రి పొద్దుపోయేదాకా యథేచ్ఛగా మద్యం సేవిస్తున్నారు. కళ్యాణదుర్గం బైపాస్ నుంచి రుద్రంపేట బైపాస్ కి మధ్యలో ఉన్న ఓ డాబాలో ఏకంగా రాత్రి 2 గంటల వరకు మద్యం సేవిస్తున్నారు. ఇదేమని డాబా నిర్వాకులను ప్రశ్నిస్తే మందు తాగించడానికి తమకు అనుమతి ఉందని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. బార్లకు తప్ప వేరే ఎవ్వరికీ లేని అనుమతి వీరికి ఎవరు ఇచ్చారో ఎక్సైజ్ అధికారులే సమాధానం చెప్పాలి. ఇక రుద్రంపేట బైపాస్ నుంచి రాప్తాడు వరకు మోడ్రన్ పేర్లతో పలు రెస్టారెంట్లు ఉన్నాయి. వీటిలో కొన్నింటిలో రిసార్ట్‌ల పేరుతో తెల్లవార్లూ యథేచ్ఛగా మద్యాన్ని తాగిస్తున్నారు. డాబాల సంగతి అటుంచితే కూల్ డ్రింక్స్ షాపుల్లో సైతం మద్యం బహిరంగంగా సేవిస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు.

కన్నెత్తి చూడని పోలీసులు, ఎక్సైజ్ అధికారులు

నూతన మద్యం పాలసీ లో భాగంగా బార్లలో తప్ప డాబాల్లో గానీ బహిరంగంగా కానీ మద్యం సేవిస్తే నేరంగా పరిగణిస్తారు. నగర శివారు కాలనీలలో కానీ, ఊరికి సుదూరంగా చీకట్లో చెట్ల పొదల్లో కూలిపని చేసుకునే వారు మద్యం సేవిస్తుంటే పోలీసులు టార్చ్ లైట్లు వేసుకుని వెళ్లి మరీ పట్టుకువచ్చి కోర్టుకు హాజరు పరిచి జరిమానాలు విధింపజేస్తున్నారు. అయితే నగరంలోని డాబాల్లో, హైవే పై ఉన్న ఖరీదైన రెస్టారెంట్లలో తెల్లవార్లూ మద్యం తాగిస్తున్నా పోలీసులు, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంలోని అంతరార్థం ఏమిటో పోలీసులకు, ఎక్సై అధికారులకే తెలియాలి. డాబాలన్నీ దాదాపు హైవేపై ఉండటంతో మద్యం సేవించి వాహనాలు నడిపితే ఘోర ప్రమాదాలు చోటు చేసుకునే ప్రమాదం ఉంది.ఇప్పటికైనా పోలీసులు, ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకుని పలు డాబాల్లో జరుగుతున్న మద్యపానాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి మరో పోరాటం

మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగభూషణం, ఉమామహేశ్వరరావు

మాట్లాడుతున్న మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా మరో పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగభూషణం ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎటిఎం నాగరాజు అధ్యక్షతన మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సమస్యలపై జిల్లావ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ కార్మికులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు ఆప్కాస్ అనే కార్పొరేషన్ ఏర్పాటు చేసి మున్సిపల్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు దూరం చేయడం, 60 సంవత్సరాలు నిండిన సాకుతో నిర్దాక్షిణంగా తొలగించారన్నారు. అలాగే మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో-7 ప్రకారం స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని, జగనన్న ఇచ్చిన హామీలు సమాన పనికి సమాన వేతనం, పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వం వెంటనే మున్సిపల్ కార్మికులు న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా మరో పోరాటానికి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఇంజినీరింగ్ కార్మికుల నూతన జిల్లా కమిటీ ఏర్పాటు

కమిటీ కోశాధికారి రామాంజనేయులు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నూతన కమిటీ జిల్లా అధ్యక్షులుగా సి.మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా సంజీవరాయుడు, కోశాధికారిగా రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా మురళి, ధనలక్ష్మి, ఓబుళపతి, సహాయ కార్యదర్శులుగా రాజా, కాంతమ్మ పోతులయ్యతోపాటు 32 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు.

సీనియారిటీ పాటించకుండా ఉద్యోగోన్నతి కల్పించడం అన్యాయం

కలెక్టర్‌కు అంగన్‌వాడీ మినీ కార్యకర్త చంద్రకళ వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంగన్‌వాడీ మెయిన్ కారకర్త నియామకాల్లో సీనియారిటి పాటించకుండా జూనియర్‌లకు పదోన్నతి కల్పించి తనకు అన్యాయం చేశారని అంగన్‌వాడీ మినీ కార్యకర్త సి.చంద్రకళ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎం.గౌతమిని కలిసి తనకు జరిగిన అన్యాయం తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మినీ కార్యకర్త సి.చంద్రకళ మాట్లాడుతూ శింగనమల ప్రాజెక్ట్ పరిధిలో బుక్కరాయసముద్రం మండలం గ్రామం పరిధిలో మినీ అంగన్‌వాడీ కార్యకర్తగా 2-5-2013లో విదుల్లో చేరినట్లు తెలిపారు. బుక్కరాయసముద్రం గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు రమీజా, కామాక్షిలు పదవీ విరమణ చెందడంతో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు ఖాళీలు పడ్డాయని తెలిపారు. అదే పరిధిలో పూసల కాలనీలో మినీ కార్యకర్తగా తాను పని చేస్తున్నట్లు తెలిపారు. మెయిన్ కార్యకర్త పోస్టుకు తాను అర్హురాలిని అన్నారు. ఆ రెండు పోస్టులకు ముగ్గురు మినీ కార్యకర్తలు దరఖాస్తులు చేసుకున్నామని తెలిపారు. ఎస్.లక్ష్మి అనే మినీ కార్యకర్త 1-5-2013, సి.చంద్రకళ అను నేను తాను 2-5-2013 ఉదయం 10 గంటలకు, గౌరయ్య కాలనీలో పని చేస్తున్న మినీ కార్యకర్త అశ్విణి 2-5-2013న 11 గంటలకు విధుల్లో చేరారని తెలిపారు. ముగ్గురు అభ్యర్థుల్లో సి.చంద్రకళ అను నాకు వయసు రిత్యా, విద్యార్హతలో వారిద్దరి కంటే తనకే ఎక్కువ సీనియారిటి ఉందన్నారు. అయితే సిడిపిఓ సంబంధిత అధికారులు ఒక రోజు ముందుగా విధుల్లో చేరిన ఎస్.లక్ష్మిదేవికి సీనియారిటి అంటూ కార్యకర్తగా పదోన్నతి కల్పించారన్నారు. ఒక పోస్టుకు సి.చంద్రకళ అను నేను, అశ్విణిలు నిలిచామన్నారు. ఇద్దరు ఒకే రోజు జాయిన్ అప్పటికి తాను గంట ముందుగా జాయిన్ అయ్యానన్నారు. వయసులో, విద్యార్హతలో ఆమె కంటే తనకే సీనియారిటి ఉందన్నారు. కార్యకర్త పోస్టు సీనియారిటీ ఆధారంగా తనకు రావాల్సి ఉందన్నారు. కానీ తనకంటే సీనియారిటీ తక్కువ ఉన్న అశ్విణికి కార్యకర్తగా పదోన్నతి కల్పించి తనకు అన్యాయం చేశారని వాపోయారు. పదోన్నతల కోసం దరఖాస్తుల సమయం నుంచే తనపై సిడిపిఓ కార్యాలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, సరైన సమాధానం ఇవ్వకుండా జాప్యం చేశారన్నారు. ఉద్దేశపూర్వకంగా పదోన్నతిలో తనకు అన్యాయం చేసినట్లు ఉందన్నారు. విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అంతకు మునుపు ఐసిడిఎస్ పీడీ శ్రీదేవిని కలిసి వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. పరిశీలన జరిపి వాస్తవాల ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామని పీడీ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వంద కేసులు పెట్టినా వెనక్కి తగ్గను

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రభుత్వం తనపై వంద కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం రాయదుర్గంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాధించి న భావ ప్రకటనా స్వేచ్ఛతోపాటు ప్రతిపక్షాలు శాంతియుతంగా చేస్తున్న నిరసనలను వైపిసి సర్కార్ అడ్డుకుంటోందన్నారు. గత పది రోజుల్లో తనపై నాలుగు కేసులు నమోదు చేయడం బాధాకరమన్నారు. పోలీసు ఆంక్షల ఉల్లంఘన పేరుతో రాయదుర్గంలో మూడు, అనంతపురంలో ఒక కేసులో తనను నిందితుడిగా చేర్చడం విడ్డూరమన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు రాయదుర్గంలో కాగడాల ర్యాలీ చేస్తే కేసు పెట్టారన్నారు. అలాగే చంద్రబాబుకు మద్దతుగా కురుబల సంప్రదాయ పద్ధతిలో నిరసన తెలిపితే మరో కేసు నమోదు చేశారన్నారు. వాల్మీకి, బోయలు పెద్ద ఎత్తున శాంతి యుతంగా దీక్ష చేపడితే ఇంకో కేసు పెట్టారన్నారు. వేలాది మంది ప్రజలు, యువకులు, మహిళలు స్వచ్ఛందంగా అనంతపురం నగరంలో కాగడాల ప్రదర్శన చేస్తే కేసు పెడుతారా అంటూ నిలదీశారు. వరుస కేసులతో తనను వేధించడానికి వైసీపీ ప్రభుత్వం తెగ ఆరాటపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తానికి చట్టవ్యతిరేక శక్తిగా తనపై ముద్ర వేయడానికి వైసీపీ నాయకత్వం సాగిస్తున్న కుట్రలను ప్రజాక్షేత్రంలోనే ఎండగడతానన్నారు. తనపై నమోదవుతున్న అక్రమ కేసుల వెనుక విప్ కాపు రామచంద్రారెడ్డి ఒత్తిడి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశాలుంటాయని అభిప్రాయపడ్డారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా వాటన్నింటినీ అధిగమించి ఉద్యమాన్ని ఉధతం చేస్తామని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ ఎం.గౌతమి

సమావేశంలో మాట్లాడుతున్నకలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. కాలేజీలకు వెళ్లినప్పుడు హెల్మెట్ వాడకం, మొబైల్ రైడింగ్, ఓవర్ రైడింగ్, రోడ్డు భద్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు గుర్తించిన బ్లాక్ స్పాట్ లను రోడ్డు ప్రమాద రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. నగరంలో నగరపాలక సంస్థ అందించిన సీసీ కెమెరాలను అవసరమైన చోట ఇన్‌స్టాలేషన్ చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు కషి చేస్తామన్నారు. వచ్చే మూడు నెలల్లో రోడ్డు ప్రమాదాలు తగ్గించడంపై పురోగతి సాధించేలా చర్యలు చేపడతామన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎఫ్ఓ సందీప్ కపాకర్, ఉప రవాణా కమిషనర్ వీర్రాజు, నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, సిపిఓ ప్రశాంత్ కుమార్, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, జిజిహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, డిసిహెచ్ఎస్ పాల్ రవికుమార్, ఆర్టీవో సురేష్ నాయుడు, ఎంవిఐలు అతికానాజ్, రమణారెడ్డి, జె.శ్రీనివాసులు, నేషనల్ హైవే అధికారి భరత్ భూషణ్, డిఇఓ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ప్రభుత్వం అందించే సంపూర్ణ పౌష్టికాహారమే ముద్దు అని వేపులపర్తి సెక్టార్ సూపర్‌వైజర్ రామాంజనమ్మ తెలిపారు. పౌష్టిక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని బైరసముద్రం అంగన్‌వాడీ కేంద్రంలో నెలసరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందించే ఆహారమే బలవర్ధకమైన సంపూర్ణ పౌష్టికాహారం ముఖ్యంన్నారు. అలాగే కారుచౌకగా దొరికే ఆకుకూరలు, మునగ, నవధాన్యాలు, చిరుధాన్యాలు, మొలకెత్తిన విత్తనాలు, మన ఇంటి దగ్గర పరిసర ప్రాంతాల్లో దొరికే ఆహారంతోనే పిల్లలు బలవర్ధులుగా తయారవుతారన్నారన్నారు. వేపులపర్తి సెక్టార్ పరిధిలో 28 అంగన్‌వాడీ కేంద్రాల్లో 245 మంది గర్భిణులు, 220 మంది బాలింతలకు ఇప్పటి వరకూ టిహెచ్ఆర్, అన్నం, బ్యాళ్లు, ఆయిల్ పాలు, గుడ్లు, వైఎస్ఆర్ సంపూర్ణ ఆహారం వైఎస్ఆర్ కిట్లు అందజేశామన్నారు. అలాగే ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లలకు దాదాపు 1700 పిల్లలకు బాలామృతం, 25 కోడిగుడ్లు, టిహెచ్ఆర్, పాలు గుడ్లు, మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు ప్రీస్కూల్ పిల్లలకు స్పాట్ ఫీడింగ్ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామాంజనంతోపాటు 28 అంగన్‌వాడీ సెంటర్ల కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం మండలంలో మాట్లాడుతున్న వేపులపర్తి సెక్టార్ సూపర్‌వైజర్ రామాంజనమ్మ

నార్పల : మండలంలోని ఐకెపి భవనంలో శుక్రవారం పోషన్ మాహ్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ భారతి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సునాలిని, అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగల అరెస్టు : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ద్విచక్ర వాహనాలు దొంగిలించే ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి రూ.18.60 లక్షలు విలువజేసే 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెడు అలవాట్లకు అలవాటు పడిన గార్లదిన్నె మండలం సంజీవపురం గ్రామానికి చెందిన శంకర్ సాయికుమార్, ఓబన్న, తాడిపత్రికి చెందిన ప్రస్తుతం పామిడిలో నివసిస్తున్న షేక్ మదార్‌వలి సులభంగా డబ్బు సంపాదించడం కోసం ద్విచక్ర వాహనాలు దొంగిలించడం అలవాటు చేసున్నాడు. వీరిలో షేక్ మదార్‌వలికి గతంలో మోటార్ సైకిల్ మెకానిక్‌గా పని చేసిన అనుభవం ఉండటంతో సులభంగా వాహనాలు దొంగిలించేవారు. గతేడాది కాలంగా అనంతపురం ఆర్టీసీ బస్టాండ్, గుత్తి, తాడిపత్రి, శింగనమల, బనగానపల్లె, డోన్, కర్నూలు, నంద్యాల, ఎస్ఎస్ గేట్, ఎస్‌కె యూనివర్సిటీ, బెంగళూరు, శిరిగుప్ప, బళ్లారి ప్రాంతాల్లో 30 ద్విచక్ర వాహనాలను దొంగిలించారు. దొంగిలించిన వాహనాలను నేషనల్ పార్క్ వద్ద ఉన్న పాడుబడిన షెడ్‌లో దాచిపెట్టారు. ఈనేపథ్యంలో ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ఆర్ విజయభాస్కర్ రెడ్డి, డీఎస్పీలు ప్రసాదరెడ్డి, బీవీ శివారెడ్డి పర్యవేక్షణలో అనంతపురం త్రీటౌన్ సీఐ ధరణీకిషోర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జీటీ.నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది బృందంగా ఏర్పడి స్థానిక నేషనల్ పార్క్ వద్ద ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహన దొంగలను అరెస్టు చేయడంలో కృషి చేసిన సీఐలు ధరణీకిషోర్, జీటీ నాయుడు, ఎస్ఐలు నబీరసూల్, నాగరాజు, హెచ్‌సీలు శ్రీధర్, శ్రీనివాసులు, తిరుమలేష్, శ్రీధర్ ఫణీ, పీసీలు రంజిత్, ప్రభు, ఆనంద్, శ్రీనివాసులు, రమణ, స్వరూప్, ప్రవీణ్‌ను ఎస్పీ అభినందించారు.

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్య

మృతిచెందిన వరలక్ష్మి

ఆత్మకూరు : మండల పరిధిలోని తలుపూరు గ్రామానికి చెందిన వరలక్ష్మి (41) కడుపునొప్పి తాళలేక శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ జనార్ధన్ తెలిపిన వివరాల మేరకు.. భర్త గోవిందు, వరలక్ష్మి వ్యవసాయ పనులతోపాటు పొట్టేళ్లు మేపుకుంటూ జీవనం సాగించేవారు. ఈనేపథ్యంలో వరలక్ష్మికి తరచూ కడుపునొప్పి వచ్చేది. ఈనేపథ్యంలో నొప్పిని తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలికి ఒక కుమార్తె ఉంది. మృతురాలి భర్త గోవిందు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

పెద్దవడుగూరు : మండలంలోని కాశేపల్లి టోల్ ప్లాజా వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంజనేయులు (62) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గుత్తిలోని వీరారెడ్డి కాలనీకి చెందిన ఆంజనేయులు సొంత పని నిమిత్తం పామిడికి వెళ్లి ద్విచక్ర తిరిగి వస్తుండగా వాహనం అదుపు తప్పి ముందు వెళ్తున్న వాహనానికి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆంజనేయులును చికిత్స కోసం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్యతోపాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తక్కల్లపల్లిలో ఇరువర్గాల ఘర్షణ

పుట్లూరు : మండల పరిధిలోని తక్కలపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన ఇరువర్గాల ఘర్షణలో నలుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. నాలుగు నెలల నుంచి గ్రామంలోని తిప్పారెడ్డి కుటుంబానికి, కొండారెడ్డి కుటుంబాల మధ్య పొలం సమస్య ఉంది. ఈ విషయంలోనూ ఇంటి వద్ద ఇరువర్గాలు తరచూ గొడవలు పడుతూనే ఉండేవారు. ఈనేపథ్యంలో శుక్రవారం జరిగిన ఘర్షణలో ఇరువర్గాల వారికీ గాయాలయ్యాయి. గాయాలైన వారిని వెంటనే తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘర్షణలో గాయపడిన తక్కలపల్లివాసులు

రాష్ట్రస్థాయి పోటీలకు గుత్తి విద్యార్థులు

ప్రజాశక్తి-గుత్తి

కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులు క్రీడల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తైక్వాండో, చెస్ పోటీల్లో ప్రతిభ చాటారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థినులు అండర్-19 కేటగిరిలో 7 మంది ఎంపికయ్యారు. సత్యసాయి జిల్లా ధర్మవరంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. అండర్-17 చెస్ కేటగిరిలో ఎం.హాసిని మొదటి స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. తైక్వాండో జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎన్.నేత్ర ఎం.కుసుమ, వై.గౌతమి, ఆర్.రజిత, వై.మౌనిక, టి.అమృత, యు.భువనేశ్వరి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ ఎం.రుద్రాక్షి, వ్యాయమ ఉపాధ్యాయురాలు ఎంహెచ్. కళ్యాణి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థినులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో అధ్యాపకులు

స్టాండప్ ఇండియా, పిఎంఇజిపి లక్ష్యాలను చేరుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

స్టాండప్ ఇండియా, పిఎంఈజిపి లక్ష్యాలను చేరుకోవాలని, పారిశ్రామికవేత్తలను అన్నిరకాలుగా ప్రోత్సహించాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన 45వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించాలన్నారు. జిల్లాలో 2015-20 ఇండస్ట్రియల్ పాలసీలో 4 యూనిట్లకుగాను రూ.3.69 లక్షలు, 2020-23లో 2 యూనిట్లకు రూ.1.03 లక్షలు, జగనన్న బడుగు వికాసము క్రింద 1 యూనిట్లకు రూ.6.39 లక్షలు సబ్సిడీ మంజూరుకు ఈ సమావేశంలో ఆమోదం తెలిపారు. 50 దరఖాస్తులు రాగా అందులో 22 దరఖాస్తులు నిర్దేశించిన గడువులోగా ఆమోదించినట్లు తెలిపారు. మిగిలిగిన దరఖాస్తులను గడువులోగా ఆమోదించాలని అధికారులను ఆదేశించారు. పారిశ్రామికవాడల్లో పరిశ్రమలకు కేటాయించిన స్థలాల్లో పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మాసం రాప్తాడులో స్థాపించే యూనిట్లు, ప్రగతి నివేదికను సమర్పించాలని జోనల్ మేనేజర్ ఎస్ఐపీసీని ఆదేశించారు. రాప్తాడు ఇండస్ట్రియల్ పార్క్‌లో స్థలం కేటాయించి ఇప్పటి వరకూ పరిశ్రమలు స్థాపించని వారి ప్లాట్లు రద్దు చేయాన్నారు. రాప్తాడులో వచ్చే పరిశ్రమలకు అహుడా అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. టెక్స్‌టైల్డ్ పార్క్, 74- ఉడేగోళంలో 55 ప్లాట్ లకు గానూ 8 యూనిట్లు మాత్రమే వచ్చాయి, మిగిలిన 47 ప్లాట్లలో పరిశ్రమలు స్థాపించే విధముగా చర్యలు తీసుకోవాలి చేనేత జౌళి శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజారావు, ఏపిఐఐసి జడ్ఎం సోని, నగర పాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, సోషల్ వెల్ఫర్ జెడి మధుసూదన్ రావు, ఎల్డిఎం సత్యరాజ్, బిసి కార్పొరేషన్ ఈడి సుబ్రహ్మణ్యం, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

మాబ్ ఆపరేషన్‌పై శిక్షణ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లాలోని ఏఆర్ స్పెషల్ పార్టీ సిబ్బందికి స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ పర్యవేక్షణలో మాబ్ ఆపరేషన్‌పై సాధన చేయించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగే సందర్భాల్లో, ఆందోళనల సమయాల్లో జన సమూహాన్ని ఎలా చెదరగొట్టాలి, ఎలా సర్దుమణచాలి తదితర అంశాలపై తర్ఫీదు నిచ్చారు. సమూహాలను చెదరగొట్టే క్రమంలో ఆందోకారులు లేదా పోలీసు సిబ్బంది గాయపడితే ఎలాంటి తక్షణ చర్యలు చేపట్టాలో రిహార్సల్స్ చేయించారు.

మాబ్ ఆపరేషన్ సాధనను పరిశీలిస్తున్న ఎస్పీ అన్బురాజన్

యువతకు అధికంగా గుండె సమస్యలు

కిమ్స్ సవీరా ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం

హైదరాబాద్ లాంటి పెద్ద నగరాలతో పోలిస్తే అనంతపురం, రాయలసీమ ప్రాంతంలో యువతలో గుండె సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని కిమ్స్ సవీరా ఆస్పత్రి కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ బాలకిషోర్ చెప్పారు. గుండె సమస్యలతో తమ వద్దకు వస్తున్న కేసుల్లో 20శాతం 40ఏళ్లలోపువారు.. 8శాతం అయితే 35ఏళ్లలోపు వారు ఉంటున్నారని తెలిపారు. ప్రధానంగా మద్యపానం, ధూమపానం, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం ఇందుకు కారణాలు అవుతున్నాయని వివరించారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతపురం ప్రభుత్వాస్పత్రి నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ వెళ్లి, అక్కడి నుంచి తిరిగి ప్రభుత్వ ఆసుపత్రి వరకూ ర్యాలీ నిర్వహించారు. అలాగే ఉదయం పోలీసు మైదానంలో 5కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకిషోర్ మాట్లాడుతూ మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం, పామోలిన్ ఆయిల్ లాంటి శాచ్యురేటెడ్ నూనెల వాడకం వల్ల గుండె సమస్యలు ఎక్కువగా వస్తున్నట్లు తాము గుర్తించామన్నారు. నగరాలతో పోలిస్తే ఈ ప్రాంతంలో ఆహారపు అలవాట్ల మీద అవగాహన కొంత తక్కువగా ఉన్నట్లు గమనించామన్నారు. దీనిపై అందరికీ తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ర్యాలీలో కిమ్స్ సవీరా ఆసుపత్రికి చెందిన కార్డియాలజిస్టులు మూడే సందీప్, ప్రదీప్‌కృష్ణ, ఫల్గుణ, స్పందన, సిటీ సర్జన్ సందీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న కిమ్స్ సవీరా ఆసుపత్రి సిబ్బంది

మంత్రిని కలిసిన ఎస్పీ అన్బురాజన్

మంత్రి ఉషశ్రీచరణ్‌కు బొకే అందజేస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం : మంత్రి ఉషశ్రీచరణ్‌ని స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా పుష్పగుచ్చం అందజేశారు.

ఉరవకొండ : ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అన్బురాజన్‌ను మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి శుక్రవారం అనంతపురంలోని ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు రాయదుర్గంలో విద్యుత్ కోత

రాయదుర్గం : రాయదుర్గం మండలం 74 ఉడేగోళం వద్ద 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సంస్థ అసిస్టెంట్ ఇంజినీర్ బాలచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయదుర్గంతోపాటు మండలం అంతా శనివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్మికులకు పనిముట్లు పంపిణీ

గుత్తి : మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు రక్షక కవచాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ప్రభుత్వం సరఫరా చేసిన సేఫ్టీ జాకెట్ కోట్, గ్లౌజులు, వివిధ పనిముట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, వైస్ ఛైర్‌పర్సన్లు పద్మాలత, వరలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, కౌన్సిలర్లు రూపవతి, వరదరాజులు, ఫారూఖ్, వాల్మీకి శివ, నజీర్, రమణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుంటున్న వైద్యసిబ్బంది

డ్రై డేతో వ్యాధుల నివారణ

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రతి ఒక్కరూ ప్రతి ఫ్రైడే డ్రైడేను పాటించడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా అరికట్టవచ్చని సిహెచ్ఒ నాగ రంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేపై సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శేఖర్, ఏఎన్ఎం చాముండేశ్వరి, ఎంఎల్ హెచ్‌పి భవాని, దాస్, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం

బుక్కరాయసముద్రం : మండలంలోని జంతలూరు 14వ బెటాలియన్‌లో పని చేస్తూ మరణించిన ఓ కానిస్టేబుల్ భార్యకు కమాండెంట్ గంగాధర రావు శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక బెటాలియన్‌లో పని చేస్తూ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు మృతిచెందాడు. దీంతో ఆయన భార్య రాధకూ రూ.25వేల చెక్కును అందజేశారు. అంతేగాకుండా ఆయనకు రావాల్సిన అన్ని బెనిఫిట్స్‌ను త్వరలో వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ నాగేశ్వరప్ప, ఎఎఒ విజయ్‌కుమార్‌నాయుడు, బెటాలియన్ పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి చెక్కు అందజేస్తున్న 14వ బెటాలియన్ కమాండెంట్ గంగాధర రావు

శ్రీ అశ్వర్ధనారాయణ స్వామి మరియు శ్రీ భీమలింగేశ్వర స్వామి దేవస్థానం

A.పప్పూరు గ్రామము, పెద్ద పప్పూరు మండలం, అనంతపురం జిల్లా-515455,

తేదీ:29/09/2023

పై దేవస్థానముకు సంబంధించిన పనులు మరియు కార్య నిర్వాహణాధికారి కార్యాలయ పనులకు ఒక జూనియర్ సహాయకుని పొరుగుసేవ సంస్థ ద్వారా సరఫరా చేయుటకు (నియమించుటకు) ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏజెన్సీ వారు తమ కొటేషన్లు 06/10/2023వ తేది లోపల దేవస్థానము కార్యాలయము నందు సమర్పించవలెను.

యం.శ్రీనివాస రెడ్డి
ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి

యం.వి.సుబ్రమణ్యం
కార్యనిర్వాహణాధికారి

'పంట సంజీవిని' పరికరాల పరిశీలన

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రభుత్వం రైతులకు అందించిన పంట సంజీవని పరికరాలను ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజతో కలిసి డిఆర్‌సి సెంటర్ పీడీ మద్దిలేటి శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా విడపనకల్ మండల పరిధిలోని పోలికి గ్రామంలోని రైతు నెట్టికంటయ్యకు ప్రభుత్వం పంట సంజీవిని పరికరాలు పంపిణీ చేసింది. ఈ పరికరాలు రైతులకు ఉపయోగంలో ఉన్నాయా.. లేదా అనే అంశాలపై రైతును అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా రెయిన్‌గన్, పైపులు, ఆయిల్ ఇంజిన్లను పరిశీలించారు. ఈ పరికరాలు ప్రస్తుతం మరమ్మతులు చేయడానికి కూడా సాధ్యం కాకుండా పూర్తిగా చెడిపోయి ఉన్నాయని వ్యవసాయ అధికారులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రతాప్, ఏఈఓ ప్రసాద్, వీఏఏ రమేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రెయిన్‌గన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

స్వామినాథన్ మృతి తీరనిలోటు

ఉరవకొండ : భారతదేశ హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మృతి బాధాకరమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.ఎం.చెన్నరాయుడు తెలిపారు. ఈమేరకు శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వ్యవసాయాన్ని మార్చిన శాస్త్రవేత్త ఎంఎస్.స్వామినాథన్


ఎంఎస్ స్వామినాథన్‌కు నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

అనంతపురం కలెక్టరేట్ : దేశ వ్యవసాయ రూపురేఖలు మార్చిన గొప్ప శాస్త్రవేత్త, హరిత విప్లవ పితామహుడిగా ఎంఎస్ స్వామినాథన్ చరిత్రలో నిలచిపోయారని బార్ అసోసియేషన్ అధ్యక్షులు విశ్వనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్రాముడు, సీనియర్ న్యాయవాది విట్టల్ కొనియాడారు. శుక్రవారం బార్ అసోసియేషన్, ఐలు సంయుక్త ఆధ్వర్యంలో ఎంఎస్.స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పి.క్రిష్ణస్వామి కుమార్, వరప్రసాద్, మనోహర్ నాయుడు, ఐలు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వీరు యాదవ్, సతీష్, ఐలు రాష్ట్ర నాయకులు సూర్యచంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న జగన్ సర్కారు

దీక్షలో మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో వైసీపీ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని నడిబజార్‌లో ఖునీ చేస్తోందని మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. శుక్రవారం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన దీక్ష శిబిరంలో నూలు వడికే రాట్నాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ అన్ సౌండ్ మైండ్ వ్యక్తి అన్నారు ప్రస్తుతం రాష్ట్ర ప్రజానీకానికి స్పష్టత వచ్చిందన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థలో లక్షలాది మందికి శిక్షణ ఇవ్వడంతో పాటు డెబ్బై వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించిన చంద్రబాబును తప్పుడు కేసులో జైలుకు పంపడం దుర్మార్గమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మారుమూల ప్రాంతాలకు హై స్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించిన ఫైబర్ గ్రిడ్ సంస్థపై తప్పుడు ఆరోపణలు చేయడం భావ్యం కాదన్నారు. ఒక మీటరు రోడ్డు వేయని, ప్రభుత్వ సొమ్ము నయా పైసా కూడా ఖర్చు చేయని ఇన్నర్ రింగ్ రోడ్డులో అవినీతి ఎలా జరుగుతుందని మండిపడ్డారు. కక్ష పూరితంగా ఎన్నికల ముందు కావాలనే తప్పుడు, పస లేని కేసులతో చంద్రబాబును జైల్లో పెట్టడం అన్యాయమన్నారు. ఎన్ని కుట్రలు చేసినా అంతిమంగా న్యాయమే గెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చేనేత డైరెక్టర్ టంకశాల హనుమంతు, కౌన్సిలర్ జ్యోతి, జిల్లా అధికార ప్రతినిధి పోరాళ్ల పురుషోత్తం, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ముదిగల్లు జ్యోతి, జిల్లా బిసి నాయకులు ధనార్జున, తిప్పేస్వామి, చెన్నవీర, రాజశేఖర్, శివ, మాజీ జడ్పిటిసి శ్రీరాములు, శీనా, రాజశేఖర్, జగదీష్, సురేష్, మహేష్, రవి, వెంకటేశులు, రాజా, రఘు, రాము, శంకర్, గోవింద, రాఘవేంద్ర, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆదేశాలతో టిడిపి నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా ఉరవకొండ సమీపంలోని హంద్రీనీవా కాలువలో జలదీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కండక్టర్ తిమ్మప్ప, రాజేష్, పాల గోవిందు, వార్డు సభ్యుడు రామాంజనేయులు, తాజుద్దీన్, ఖలందర్, రహంతుల్లా, వరప్రసాద్, శంకర్‌నాయక్, నిమ్మల ప్రసాద్, వడ్డే లాలుస్వామి, జగదీష్, రామాంజనేయులు, గురుస్వామి, మహేష్, కుమార్, నూర్, టిఎన్ఎస్ఎఫ్ భరత్‌కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో రాట్నాలతో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

నార్పల : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయం వద్ద టిడిపి నాయకులు చేపట్టిన రిలేదీక్షలు శుక్రవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అరాచక పాలన సాగుతోందన్నారు. రాష్ట్రం కోసం, దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడం బాధాకమరన్నారు. జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేయాలనే కుట్రతో చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన వైపిపి ప్రభుత్వానికి పతనం ప్రారంభమైందని టిడిపి రాష్ట్ర నాయకులు ఆదినారాయణ అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం కూడా కొనసాగాయి. ఈ దీక్షలో టిఎన్‌టియుసి జిల్లా ఉపాధ్యక్షుడు శిరివాటి వన్నూరు, బెడ బుడగ సంఘం నాయకులు బాబయ్య, నల్లప్ప, టిడిపి నాయకులు సీననాయక్,. నాగరాజు, వెంకటేష్, మల్లేష్, బండి సుంకయ్య, కుళ్లాయప్ప, అంజి, వెంకీ, వీరయ్య, ప్రసాద్, కుల్లాయప్ప మోక్ష, వీరాంజి చేపట్టారు. సంఘీభావంగా టిడిపి సీనియర్ నాయకులు సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, నటేష్ చౌదరి, రాజారావు, పోతుల లక్ష్మీనరసింహులు, సుధాకర్ యాదవ్, వంకదారు వెంకటకష్ణ, జేయంబాషా తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో దీక్షలు చేస్తున్న టిడిపి నాయకులు

సకాలంలో పెన్షన్ ఇవ్వాలి

ఖజానా శాఖ డీడీకి పెన్షనర్ల సంఘం నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లందరికీ ప్రతినెలా 1, 2వ తేదీల్లోనే పెన్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ జె.సరళ విజయకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సర్వీస్‌లో సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహించి, రిటైర్ అయిన పెన్షనర్లు ప్రతీ నెలా పెన్షన్ పైన మాత్రమే జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పెన్షన్ 1,2 తేదీల్లో రానందున చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెన్షన్ సకాలంలో వచ్చే రీతిలో చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సర్వీస్ పెన్షనర్ భార్య, భర్త చనిపోయిన తర్వాత దహణ సంస్కారాల ఖర్చు నిమిత్తం ఇచ్చే డబ్బులనును త్వరగా ఇచ్చేలా చూడాలన్నారు. పెన్షన్ ఒక ఎస్‌టిఓ నుంచి వేరొక ఎస్‌టిఓ పరిధిలోకి బదిలీ చేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించేందుకు చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి ప్రతిపాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా కోశాధికారి రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్, సంయుక్త కార్యదర్శి క్రిష్టప్ప, రాజు, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం సమర్పిస్తున్న పెన్షనర్లు

సమస్యలపై దృష్టి సారించాలి

కౌన్సిల్ సమావేశాల్లో సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలోని సభా మందిరంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి. వన్నూరుబీ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే పలువురు కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. తాగునీటి సమస్యపై అధికారుల నిర్లక్ష్య ధోరణికి కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వార్డుల్లో వీధిదీపాలు వెలగడం లేదని మరమ్మతులు గురైన అధికారులు పట్టించుకోవడంలేదని కౌన్సిలర్లు ఖాజాఖాన్, ఫారూఖ్, రమణ అన్నారు. మురుగునీరు రహదారులపై ప్రవహిస్తుందని కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య చెప్పారు. డ్రెయినేజీలు నిర్మించాలని గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించిన స్పందన కరువైందన్నారు. వార్డుల్లో సమస్యలు తాండవిస్తున్నాయని వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి కౌన్సిలర్ నజీర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ రవికుమార్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రంగయ్య, టిపిఒ మహబూబ్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో సమస్యలపై ఏకరువు పెడుతున్న కౌన్సిల్ సభ్యులు

రాయదుర్గం సమావేశానికి హాజరైన నాయకులు, అధికారులు

రాయదుర్గం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛతాహి సేవ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను విజయవంతం చేయాలని కమిషనర్ దివాకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం పురపాలక సంఘ అధ్యక్షులు పొరాలు శిల్ప అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద పట్టణంలో మూడు చోట్ల ఆరోగ్య శిబిరాలలో వైద్యులు ప్రజల ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి వైద్య పరీక్షలు, చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. అలాగే అక్టోబర్ మొదటి, రెండు తేదీల్లో పట్టణంలోని అన్ని వార్డులలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ రెండు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కమిషనర్ కోరారు. అంతకుముందు కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఒక అంశం మినహా అజెండాలోని అన్ని అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కాగా తదనంతరం జరగవలసిన అత్యవసర సమావేశాన్ని సభ్యులు వాయిదా వేశారు. ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

గుంతకల్లు సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవాని

గుంతకల్లు : మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవాని అధ్యక్షతన పట్టణంలోని స్థానిక కౌన్సిల్ హాలులో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశం రసాభాసా సాగింది. ముందుగా మున్సిపల్ గుమస్తా అజెండా అంశాలను చదువుచుండగా 2015లో అప్పటి కౌన్సిల్‌లో బాలికల పాత ఉన్నత పాఠశాల స్థానంలో గుడ్ విల్ పద్ధతిన నిర్మించనున్న మల్టీపర్పస్ ఆడిటోరియం విషయంలో డిపిఆర్ కోసం ఓ కంపెనీకి రూ.12.90 లక్షలు చెల్లించే విషయంపై టిడిపి కౌన్సిలర్ పవన్ కుమార్‌గౌడ్ ఆక్షేపణ చేశారు. దీంతోపాటు పట్టణంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ వద్ద మున్సిపల్ స్థలంలో రేకులషెడ్లు వేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో వెంటనే ఆ వార్డు వైసిపి కౌన్సిలర్ చాంద్‌బాషా షెడ్లు ఏర్పాటుపై తనకేమీ సంబంధం లేదని, వారు ఏళ్ల తరబడి అక్కడ చిన్న బంకులు వేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారని రోడ్డు విస్తరణలో తొలగించినందున ఎమ్మెల్యే సూచనతో ఓ షెడ్డు నిర్మాణం చేసే వ్యక్తి ఆధ్వర్యంలో వ్యాపారులు స్వతహాగా ఏర్పాటు చేసుకున్నారని వివరించారు. దీంతో ఇద్దరి మధ్య కొంతసేపు వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రాంతంలో చిరు వ్యాపారులకు ఇబ్బందులు కలిగించరాదని దీంతో ఛైర్‌పర్సన్ కల్పించుకుని ఇందులో ఎలాంటి అవకతవకలు జరగలేదని, గతంలోనే లబ్ధిదారులు చెప్పారని దీన్ని రాద్ధాంతం చేయరాదన్నారు. వీటితోపాటు పలు అంశాలపై పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన కమిషనర్ మల్లికార్జున పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా ప్రజా సమస్యలను నెలకోసారి జరిగే కౌన్సిల్ సమావేశంలో ఛైర్‌పర్సన్, అధికారుల దృష్టికి తేవాల్సిన అధికారపక్షానికి చెందిన మెజారిటీ కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరు కావడం గమనార్హం. అయితే రిజిష్టర్‌లో మాత్రం హాజరైనట్లు సంతకాలు కనిపించడం విశేషం. ఈ సమావేశంలో టిడిపి, వైసిపి, సిపిఐ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్యసేవలు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని నాయనపల్లి సచివాలయ పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ దివాకర్ తెలిపారు. ఈమేరకు జిల్లా మలేరియా అధికారి ఓబులుతో కలిసి గ్రామంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిహేను రోజుల నుంచి వాలంటీర్లు, హెల్త్ సిబ్బంది కలిసి నాయనపల్లి, మద్దలపల్లి, వెంకటంపల్లి గ్రామాల్లో సర్వే నిర్వహించడంతోపాటు వివిధ రకాల పరీక్షలు చేసి చికిత్స అవసరమైన వారికి టోకెన్లు ఇచ్చినట్లు తెలిపారు. వీరందరికీ నిపుణులైన డాక్టర్లతో వైద్య పరీక్షలు చేయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హరికుమార్, నార్పల ప్రాథమిక వైద్యశాల వైద్యులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సూపర్‌వైజర్ అక్కులప్ప, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల మండలం నాయనపల్లిలో నిర్వహించే ఆరోగ్య సురక్ష ఏర్పాట్లను పరిశీలిస్తున్న మండల అధికారులు

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి ఆధ్వర్యంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్షపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీవాణి మాట్లాడుతూ ఆరోగ్య సురక్షలో భాగంగా శనివారం తక్కలపల్లిలో పర్యటించనున్నట్లు తెలిపారు. గ్రామంలో ఇప్పటికే వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం సరిగా లేని వారిని గుర్తించామన్నారు. అలాంటి వారికి టోకెన్లు కూడా ఇచ్చినట్లు తెలిపారు. వీరికి శనివారం సంబంధిత వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మోహన్‌కుమార్, ఆర్ఐ కిష్టప్ప, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ తేజోష్ణ

బుక్కరాయసముద్రం : విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపిడిఒ తేజోష్ణ హెచ్చరించారు. మండలంలోని రేకులకుంట గ్రామ సచివాలయంలో శనివారం నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలోని సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

ఇకెవైసి పూర్తి చేయండి

ఉరవకొండ : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట నమోదు రైతుల ఇకెవైసిని వేగవంతంగా పూర్తి చేయాలని ఉరవకొండ మండల వ్యవసాయ అధికారి శుభకర్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్ద కౌకుంట్ల గ్రామ రైతు భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని రైతులందరూ కచ్చితంగా ఈ కెవైసీ చేయించుకోవాలని సూచించారు. పంట నమోదు కార్యక్రమం నేటితో ముగుస్తుందన్నారు. ఇప్పటి వరకూ ఎవరైనా రైతులు పంట నమోదు చేసుకోకపోతే వెంటనే నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది నీలిమ, ఆంజనేయులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఇకెవైసిని తనిఖీ చేస్తున్న ఉరవకొండ మండల వ్యవసాయ అధికారి శుభకర్

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : ఎంపిడిఒ

కుందుర్పి : అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపిడిఒ వెంకటనాయుడు హెచ్చరించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై పథకాల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పకడ్బందీగా విధులు నిర్వర్తించాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా సంక్షేమ పథకాలు ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా అన్నివిధాలా సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

బ్రహ్మసముద్రం : మనం నివసించే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి అన్నారు. శుక్రవారం ఉన్నత పాఠశాల విద్యార్థులతో 'మన గ్రామం స్వచ్ఛ గ్రామం' అన్న కార్యక్రమంలో భాగంగా పాఠశాల నుంచి స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వరకూ విద్యార్థులతో కలిసి ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలోఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద శుక్రవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలామురళి అన్నదానం మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు విశ్వేశ్వర వుడ్ కార్వింగ్ వర్క్స్ యజమాని భాస్కరాచారి, సతీమణి యశోదమ్మ మనవరాలు తవిశ్రీ పుట్టినరోజు సందర్భంగా అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుబ్రమణ్యం, కిష్టప్ప, రమణ, నాగమణి, నరేష్, జగన్నాథ్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్న వైసిపి

శింగనమల : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడుస్తోందని మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మాసూల చంద్రమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. టిడిపి అధినేత అక్రమ అరెస్టు బాధాకరమన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టి జైల్లో ఉంచినా బెదిరేది లేదన్నారు. 45ఏళ్ల రాజకీయ జీవితం, 14 ఏళ్ల ముఖ్యమంత్రి హోదాలో ఎలాంటి అవినీతికి పాల్పడని వ్యక్తి చంద్రబాబు అనానరు. అలాంటి వ్యక్తిని సిఎం జగన్ కావాలనే అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టారన్నారు. త్వరలోనే చంద్రబాబు మచ్చలేని నాయకుడిగా బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు.